క్లుప్తంగా

బంతిపూల సోయగం



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు శింగవరం రోడ్డులో రైతు గుడిమెట్ల శంకర్ రెండు ఎకరాల్లో సాగు చేసిన బంతిపూలు విరగబూసి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఓ పక్క ఎండలు మండిపోతుండగా కొన్ని పంటలకు నీరు అందక ఎండి పోతున్నాయి. అయితే పెద్ద సంఖ్యలో ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాలు జరుగుతాయని, తద్వారా బంతిపూలకు డిమాండ్ ఉంటుందని గ్రహించిన మండలంలో పలువురు రైతులు బంతి సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బంతి రూ.40 నుంచి రూ.50 పలుకుతోందని రైతు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



నందిగామ టౌన్: చలివేంద్రాలతో ప్రజల దాహార్తిని తీర్చవచ్చని రైతుబజార్ ఎస్టేట్ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి తాగునీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. ముఖ్యంగా నీటిని వృథా చేయకుండా చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీహరి, రైతుబజార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ పేర్కొన్నారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో రామ్‌కో సిమెంట్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మంగళగిరి మణిపాల్, అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు 120 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మూర్తిరావు, సర్పంచ్ మణి హుసేన్, ప్రతినిధులు ఫరూక్‌మహ్మద్, రాజా కేశవప్రసాద్, రామకృష్ణ సాయి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కేవీకేలో రెండు రోజులుగా రసాయన రంగుల అద్దకంపై మహిళలకు జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కేవీకే కో–ఆర్డినేటర్ అచ్యుతరాజు మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణతో పాటు రసాయన రంగుల అద్దకంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి, శాస్త్రవేత్తలు వెంకటరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

పథకాల రాయితీని వినియోగించుకోవాలి



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల రాయితీలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ పేర్కొన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల రాయితీలను వినియోగించుకోవచ్చని తెలిపారు. సొంత భూమి ఉన్న రైతులు నమోదు చేయించుకోవాలన్నారు. నియోజకవర్గంలో 29,482 మంది రైతులుండగా 15,717 మంది నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మీ, ఏఈఓ హారిక పాల్గొన్నారు.

రహదారులపై ప్రమాదకరంగా వాల్వ్‌పిట్స్

ప్రజల ఆందోళన

నందిగామ రూరల్: తాగునీటి సరఫరాను నియంత్రించే వాల్వ్‌పిట్ గుంతలు రక్షణ మూతలు లేకుండా ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన వీధులు, రహదారుల పక్కనే కాకుండా రహదారుల మధ్యలో కూడా వాల్వ్‌పిట్స్ ఉండటం విశేషం. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో వాల్వ్‌పిట్స్‌కు సగానికి పైగా రక్షణ మూతలు లేవని ఆయా వార్డుల ప్రజలు పేర్కొంటున్నారు. రామన్నపేట రోడ్డు, కేవీఆర్ కళాశాల పక్కన, గాంధీ సెంటరులో ఉన్న వాల్వ్‌పిట్స్ ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. గుంతలతో పాటు పక్కన పెద్ద బండరాళ్లు, వాల్వ్‌పిట్స్ వద్ద నీటిని విడుదల చేసే సమయంలో గుంతలపై తీసిన సిమెంట్ మూతలను వాటి పక్కనే పడేస్తున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రద్దీ ప్రాంతాల్లోనూ..

గాంధీ సెంటర్, రామన్నపేట రోడ్డు ప్రాంతాలు నిత్యం ఆయా గ్రామాల నుంచి వచ్చే వాహనాలు, ప్రజలతో రద్దీగా ఉంటాయి. ముఖ్యంగా గాంధీ సెంటరు రద్దీగా ఉండటమే కాకుండా ప్రభుత్వాస్పత్రి రోడ్డు, కోర్టు రోడ్డు, చందర్లపాడు రోడ్డు, రామన్నపేట రోడ్డు, మెయిన్ బజార్‌లో నుంచి వచ్చే వాహనాలకు, ప్రజలకు కేంద్ర బిందువుగా ఉంటుంది. అంతే కాకుండా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు గాంధీ సెంటర్, మెయిన్ బజార్‌లు వ్యాపార కూడలిగా ఉండటంతో వ్యాపారులు, వినియోగదారులతో కిటకిటలాడుతుంటుంది.



మెయిన్‌బజార్‌లో రక్షణ మూత లేకుండా దర్శనమిస్తున్న వాల్వ్‌పిట్

గుంతపై ప్లాస్టిక్ అట్ట..

రామన్నపేటలోని ఓక్ వాల్వ్‌పిట్ రోడ్డు పక్కన దర్శనమిస్తుండగా మరొక గుంత ఏకంగా రోడ్డుపైనే దర్శనమిస్తుండటం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో చిన్న రహదారి కావటంతో వాల్వ్‌పిట్ రహదారి పక్కన ఉండేది. గత ప్రభుత్వంలో అప్పటి శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ రహదారిని విస్తరించి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తరువాత ప్రభుత్వం మారటంతో అభివృద్ధి పనులు సైతం అసంపూర్తిగానే మిగలటంతో రోడ్డు పక్కన ఉన్న వాల్వ్‌పిట్ రోడ్డు మధ్యలోకి చేరింది. గుంతపై రక్షణ మూతలు వేసి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ అట్టముక్కను వేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రామన్నపేట రోడ్డులో రహదారిపై ఉన్న వాల్వ్‌పిట్‌పై వేసిన ప్లాస్టిక్ అట్ట

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో?



కేవీఆర్ కళాశాల పక్కన రోడ్డులో పెద బండ రాళ్లతో ప్రమాదకరంగా ఉన్న వాల్వ్‌పిట్

పట్టణంలోని ప్రధాన వీధుల్లోని వాల్వ్‌పిట్స్‌కు మూతలు లేకుండా ఉండటం, గుంతలు కూడా నాలుగైదు అడుగుల లోతులో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వాల్వ్‌పిట్స్‌పై రక్షణ మూతలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కేవీఆర్ కళాశాల పక్కన వాల్వ్‌పిట్ ఉన్న రోడ్డులో ప్రజలతో పాటు పలు విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులు కాలినడక, సైకిళ్లపై ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి రద్దీ ప్రాంతాల్లోని వాల్వ్‌పిట్స్‌కు సైతం మూతలు లేకుండా ఉంటుండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రక్షణమూతలు ఏర్పాటు చేయాలి



పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన, రహదారులపైన ఉన్న వాల్వ్‌ఫిట్ గుంతలు రక్షణ మూతలు లేకుండా దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడే అవకాశముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాల్వ్‌ఫిట్ గుంతలపై రక్షణ మూతలు ఏర్పాటు చేయాలి.

– సయ్యద్ ఖాశీం, నందిగామ

అధికారులు చర్యలు తీసుకోవాలి



రామన్నపేట రోడ్డులో వాల్వ్‌పిట్ రహదారిపై ఉన్నా అధికారులు కనీస చర్యలు తీసుకోవటం లేదు. రక్షణ మూతకు బదులు గుంతపై ప్లాస్టిక్ అట్టముక్క ఏర్పాటు చేయటం బాధాకరం. వాల్వ్‌పిట్స్‌పై మూతలు లేకుండా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కటారపు గోపాల్, నందిగామ

బార్ ఎన్నికలకు ముగిసిన ఉప సంహరణలు

ఈ నెల 27న ఎన్నిక



అధ్యక్ష పోటీలో ఉన్న విద్యాసాగర్, వెంకటనరసింహారావు

నందిగామ రూరల్: నందిగామ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఉప సంహరణల ప్రక్రియ పూర్తయినట్లు ఎన్నికల అధికారి టీపీఎమ్ శర్మ పేర్కొన్నారు. ఆయన విలేకులతో మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న నందిగామ బార్ అసోసియేషన్ ఎన్నికలకు అధ్యక్షులుగా పాలెపు వెంకటనరసింహారావు, నంద్రు బాబు విద్యాసాగర్ బరిలో నిలిచారన్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా వరదబోయిన విజయకుమార్, బొమ్మిశెట్టి ఫణికుమార్, ప్రధాన కార్యదర్శులుగా అద్దంకి మణిబాబు, చావల శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా ఉప్పులూరి డేవిడ్‌రాజు, ఏడుకొండలు, కోశాధికారులుగా మాడుగుల స్టాలిన్‌బాబు, గుంజి శ్రీనివాసరావు, లైబ్రేరియన్‌లుగా చాట్రగడ్డ రవికుమార్, షేక్ అబ్దుల్ కలాం ఆజాద్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శులుగా గుగులోతు రామారావు, బొద్దు వెంకటేశ్వర్లు పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

ఏకగ్రీవాలు..

సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా చావల సాంబశివరావు, వేమూరి సత్యనారాయణ మూర్తి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మహిళా ప్రతినిధిగా చావల లక్ష్మీదుర్గతో పాటు మహిళా రెప్రజెంటేటివ్‌గా బొద్దు ఈశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి శర్మ తెలిపారు. ఈ పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావటంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

నందిగామ టౌన్: మహిళలు, చిన్నారుల భద్రత కోసమే ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని కమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం శక్తి యాప్‌పై మహిళలు, చిన్నారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్‌లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏసీపీ తిలక్ మాట్లాడుతూ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వారు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ అయి ఉంటారని చెప్పారు. అత్యవసర సమయంలో ఫోన్‌ను ఐదు సార్లు షేక్ చేస్తే కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందని ఐదు నిముషాల్లో పోలీసులు సహాయం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా పోలీసుల శక్తి వాహనాలను ఎమ్మెల్యే, ఏసీపీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐలు వైవీఎల్ నాయుడు, చవాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఎస్ఐ అభిమన్యు పాల్గొన్నారు.



మహిళా పోలీసుల శక్తి వాహనాలను ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్యే సౌమ్య, ఏసీపీ తిలక్

న్యాయవాదులు విధుల బహిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: చింతలపూడి బార్ అసోసియేషన్ న్యాయవాది జి.వనితపై అక్రమ దాడిని ఖండిస్తూ, అదేవిధంగా న్యాయవాదిపై పోలీసులు నిర్లక్ష్య ప్రవర్తనను నిరసిస్తూ శుక్రవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు శ్రీనివాసగౌడ్, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, పూల నాగరాజు, బూడిద నరసింహారావు, కె.ప్రతాపరెడ్డి, కిషోర్, అశోక్, నరేష్, చిన్నగాంధీ, అంకమరాజు, బిక్షమయ్య, కరిసె రత్నబాబు, గురువుల రాజు, మహంతి పాల్గొన్నారు.



పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

విద్యార్థుల ఆటో బోల్తా

ముగ్గురికి స్వల్ప గాయాలు

గండ్రాయి(జగ్గయ్యపేట): ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలైన ఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని అనుమంచిపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఉదయం గండ్రాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పరీక్ష అనంతరం ఆటోలో స్వగ్రామం వస్తుండగా గ్రామంలోని అలుగు వద్దకు వచ్చేసరికి ఎదురుగా కంకర లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెను ప్రమాదం తప్పటంతో ఊపిరి విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. చిల్లకల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన ఆటో



స్వల్పంగా గాయపడిన విద్యార్థులు

పశువులకూ వడదెబ్బ

జాగ్రత్తలు తప్పనిసరి



పశు వైద్యాధికారి అనిల్

పెనుగంచిప్రోలు: వేసవి మనుషులకు మాత్రమే కాకుండా పశువుల్లో కూడా వడదెబ్బకు దారితీస్తుంది. అధిక ఉష్ణోగ్రతను రైతులు నిర్లక్ష్యం చేస్తే పశువుల్లో కూడా మరణాలు సంభవిస్తాయి. రానురాను ఎండలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. వేసవిలో పశువుల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యాధికారి పి.అనిల్ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉష్ణోగ్రతలు బాగా పెరిగి తేమ శాతం తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురౌతాయి. పశువులు కట్టివేసే చోట గాలి సక్రమంగా రాక పోవటం, కిక్కిరిసి కట్టేయటం, నీటి సౌకర్యం సరిగా లేక పోవటం వలన పశువులు వడదెబ్బకు గురి అవుతాయి. వేసవిలో బయట ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు మెదడు హైపోథాలమస్ శ్వేద గ్రంధులపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో శ్వేద గ్రంధుల ద్వారా చెమట అధికంగా పోతుంది. శరీరంలోని ఎలక్ట్రోలైట్‌లు కోల్పోయి పశువులు పూర్తిగా నీరసించి పోతాయి. ఈ చర్యలు శరీరంలోని అన్ని అవయవాలపై పడి పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి.



ఎండలో మేస్తున్న గేదెలు

వడదెబ్బ సోకిన పశువుల లక్షణాలు

- వడదెబ్బ సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారెన్ హీట్ కన్నా ఎక్కువగా ఉంటుంది. చర్మం గట్టి పడుతుంది.
- పశువులు నడవలేక నీడ ప్రదేశాలను వెతుక్కుంటాయి.
- చూడు పశువుల్లో గర్భస్రావాలు జరుగుతాయి. పునరుత్పత్తి ప్రక్రియ తగ్గి పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.
- తరచూ అపస్మారక స్థితిలోకి వెళ్తాయి.

చికిత్సా విధానం

- వడదెబ్బ సోకిన పశువులను నీడ, చల్లని గాలి వచ్చే ప్రాంతానికి తీసుకొచ్చి శరీర ఉష్ణం సాధారణ స్థాయి వచ్చేంత వరకు నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి.
- వైద్యులను వెంటనే సంప్రదించి ఉష్ణోగ్రతలు తగ్గించటానికి ఇంజెక్షన్లు చేయించటంతో పాటు సెలైన్‌ద్వారా గ్లూకోజ్, శక్తి నిచ్చే మందులు అందజేయాలి.

వడ దెబ్బ సోకకుండా ముందస్తు చర్యలు

- పశువులకు నీరు అందుబాటులో ఉంచటంతో బాటు చల్లని నీళ్లతో కడగాలి. పాడి గేదలకు పాలు పితికేటప్పుడు చల్లని నీళ్లతో పొదుగును కడగాలి.
- ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు వేసవిలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే గడ్డికి బయటకు వదలాలి.
- పశువులు నీటి కుంటల్లో, చెరువులు, వాగులు ఉంటే ఈదనివ్వాలి. అలాగే గాలి, వెలుతురు బాగా ఉన్న చోట మాత్రమే కట్టేయ్యాలి.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఐదో వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ ప్రభుత్వాధికారులను కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు అక్రమ లేఅవుట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోకుండా ఉన్న మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ సహకారంతో అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికే జగ్గయ్యపేటలో వివిధ ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు వేయడం వలన ప్రభుత్వానికి రావాల్సిన మున్సిపల్ స్థలాలు కోల్పోవడం ద్వారా సుమారు రూ.20 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వంలోని పెద్దలు అండగా ఉండటం వలనే ఈ రకంగా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ సూచనలను పాటించి ప్రభుత్వ ఆదాయానికి సంబంధించి స్టాంప్ డ్యూటీని, ల్యాండ్ కన్వర్షన్ ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకుని ఇకనైనా అక్రమ లేఅవుట్లు వేయకుండా చూడాలన్నారు. ప్రస్తుతం లేఅవుట్లు వేసిన యజమానులకు నోటీసులు ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు సహకరిస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోకుండా వారిని ప్రోత్సహించి అవినీతికి అవకాశాలు కల్పిస్తున్నారని, వీటన్నింటిపై భవిష్యత్‌లో కోర్టు పరంగా, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



అక్రమ లేఅవుట్లను చూపిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ మనోహర్

వంట ఏజెన్సీ నిర్వాహకుల మార్పు

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులను మార్పు చేసినట్లు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుకన్య శుక్రవారం తెలిపారు. పాఠశాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో వంట సరిగా చేయకపోవటంతోనే నిర్వాహకులను మార్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గతేడాది ఆగష్టులో చేసిన తీర్మానం ప్రకారం ఎంఈఓ–2 పద్మ, హెచ్‌ఎం శర్మ ఆమోదంతో వేల్పుల ఏసోబు స్థానంలో మందా సుజాతను, వేల్పుల కళావతి స్థానంలో మందా మరియమ్మను తీసుకున్నట్లు తెలిపారు.

నేటితో కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు ఆఖరు

గన్నవరం: వివిధ కార్పొరేషన్ల నుంచి రాయితీపై రుణాల మంజూరుకు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ టి. స్వర్ణలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఓబీసీ, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. వార్షిక ఆదాయం రూ. 81వేల లోపు ఉండి 60 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలతో శనివారంలోపు ఏపీఓబీఎం.ఎం.ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు ఉచిత యోగాశక్తి చికిత్స శిబిరం

పెనమలూరు: పటమట దత్తాశ్రమంలో ఈ నెల 23వ తేదీన ఉచిత యోగాశక్తి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామని డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం కానూరులో వివరాలు తెలుపుతూ యోగాశక్తి సాధన సమితి ఆధ్వర్యంలో 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మోకాలి నొప్పుల పై అవగాహన సదస్సుతో పాటు ఉచిత చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. మోకాలి నొప్పులతో బాధపడే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎంపీపీ ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా చర్యలు

నందిగామ రూరల్: నందిగామ ఎంపీపీ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఎంపీపీ పరోక్ష ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి ఎన్నిక పూర్తయ్యే వరకు పోలీస్ బందోబస్తు నిర్వహించాలని కోరుతూ సీఐ వైవీఎల్ నాయుడును లిఖితపూర్వకంగా కోరినట్లు చెప్పారు. వివాదాలు, ఘర్షణలకు తావు లేకుండా ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'పది' పరీక్షలకు 66మంది గైర్హాజరు

నందిగామ రూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. డివిజన్ పరిధిలోని 40 పరీక్ష కేంద్రాల్లో 6,053 మంది విద్యార్థులకు గాను 5,987 మంది పరీక్షకు హాజరయ్యారు. 66 మంది గైర్హాజరైనట్లు ఇన్‌చార్జ్ డీవైఈఓ సాంబశివరావు తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని 25 పరీక్ష కేంద్రాల పరిధిలో 3,503 మందికి గాను 3,455 మంది పరీక్షకు హాజరవగా 48 మంది గైర్హాజరయ్యారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో.. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 15 పరీక్ష కేంద్రాల పరిధిలో 2,550 మంది విద్యార్థులకు గాను 2,532ల మంది హాజరవగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

26న హుండీ లెక్కింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఈఓ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆలయ ప్రాంగణం వద్ద ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖాధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

నేడు పీ4 సర్వేపై సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సర్వేపై శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ నితిన్ శుక్రవారం పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అన్ని సచివాలయాల సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. అదేవిధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సమీకృత నీటి గుంతల ఏర్పాటుపై రైతులతో సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ జి .శ్రీను శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన ఉదయం 10 గంటలు జరిగే సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ సభ్యులు అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి

వీరులపాడు: గ్రామ కార్యదర్శులు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అరుంధతీ దేవి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో శుక్రవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నెలాఖరులోగా నూరు శాతం పన్నులు వసూలు చేయాలన్నారు.

రేపు విజయవాడలో కుసుమ ధర్మన్న సభ

కంచికచర్ల : జాతీయోద్యమకారుడు తొలి తెలుగు కవి కుసుమ ధర్మన్న జయంతి సభను ఈ నెల 23 సాయంత్రం 5గంటలకు విజయవాడ జిల్లా కోర్టు హాలు ఎదురుగా బుక్ సొసైటీ హాల్లో జరుగుతుందని బహుజనుల రచయిత వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ శుక్రవారం తెలిపారు. ఈ సభకు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి, ప్రముఖ సాహిత్య విమర్శకులు జీ లక్ష్మీనర్సయ్య, సత్యాజీ సాహితి ప్రస్తానం వర్కింగ్ ఎడిటర్ షేక్ కరీముల్లా, ప్రముఖ కవి నూకతోటి రవికుమార్, సాహితి స్రవంతి వరప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు.